సమావేశాలతో సరి!

గాజువాక ప్రాంతంలో భారీ వాహనాలతో జనం అవస్థలు పడుతున్నారు. కిలోమీటరు దూరం వెళ్లాలంటే అరగంటపాటు ట్రాఫిక్‌లో ఇరుక్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇరుకు వీధుల్లో సైతం పెద్దపెద్ద వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ఆందోళనకు గురవుతున్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఉదయం, సాయంత్రం పూట సరదాగా రోడ్లపైకి రావాలన్నా భయ పడుతున్నారు. అధికారులు ప్రకటనలు.. సమావేశాలతో సరిపెట్టకుండా క్షేత్రస్థాయిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. - గాజువాక

కనిపించని ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ▪ వీధుల్లో సైతం భారీ వాహనాల హల్‌చల్

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్ ▪ గాజువాక వాసులకు నిత్యం అవస్థలు

వాహనాల రద్దీ, ట్రాఫిక్ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు నెల రోజుల కిందట స్పందించారు. ఫార్మా బస్సుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి కొని సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని స్వయంగా ట్రాఫిక్ ఏడీసీపీ కె.ప్రవీణ్ కుమార్ బస్సుల నిర్వాహకులు, పలు ఫార్మా కంపెనీల హెచ్‌ఆర్‌లతో సమావేశం నిర్వహించారు.నిబంధనలు పాటించాలని ఆదేశించడంతో పాటు పలు సూచనలు చేశారు.

ఇలా చేస్తే మేలు

లంకెలపాలెం నుంచి షీలానగర్ వరకు జాతీయ రహదారిపై భారీ వాహనాలను కొన్ని సమయాల్లో నియంత్రించాలి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భారీ వాహనాలు నిలుపుదల చేయాలి. సిటీ ట్రావెల్స్ ఎక్కడపడితే అక్కడ ఆపకుండా కొన్ని ప్రత్యేక స్టాపులు ఏర్పాటు చేయాలి. నివాస ప్రాంతాల్లో ఉన్న రహదారులపై భారీ వాహనాలను నిలువరించాలి.

ఇదీ పరిస్థితి

అగనంపూడి నుంచి షీలానగర్ వరకు జాతీయ రహదారి నిత్యం భారీ వాహనాలతో నిండిపోతోంది. విశాఖ నగరం నుంచి ఫార్మాసిటీ, బ్రాండిక్స్ తదితర కంపెనీలకు సుమారు 220 ట్రావెల్ బస్సులు తిరుగుతున్నట్టు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో పాఠశాలలకు రాకపోకలు సాగిస్తున్న వేలాది మంది పిల్లలు ఈ భారీ వాహనాల కారణంగా అవస్థలు ఎదుర్కొంటున్నారు. అలాగే ఉద్యోగులు కూడా అవస్థలు పడుతున్నారు.



గాజువాక జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

ప్రతిరోజు ట్రాఫిక్ స్తంభనే

భారీ వాహనాలతోపాటు వివిధ కంపెనీలకు తమ ఉద్యోగులను తీసుకెళ్లడం కోసం పెద్ద పెద్ద ట్రావెల్ బస్సులు సైతం వీధి రోడ్లలో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. అదే సమయంలో పాఠశాలలకు చెందిన ఆటోలు, బస్సులు కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ కారణంగా ప్రతిరోజు ట్రాఫిక్ సమస్యగా మారింది. ప్రధాన జంక్షన్లలో భారీగా ట్రాఫిక్ జామ్ అయిపోవడం నిత్యకృత్యమైంది. సమస్య పరిష్కారం అవ్వాలంటే నిర్దిష్టమైన సమయాల్లో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

భారీవాహనాల తిష్ట



చినగంట్యాడ వందడుగుల రోడ్‌లో భారీ వాహనాల పార్కింగ్

పలు ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులు, పీహెచ్‌సీ వంటి సంస్థలున్న చినగంట్యాడ వందడుగుల రోడ్డు పూర్తిగా లారీలు, ట్యాంకర్లు, ట్రాలర్లు, ఫార్మా బస్సుల పార్కింగుతో నిండిపోతోంది. ఉదయం, సాయంత్రం ఆ రోడ్డులో వెళ్లాంటే ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందో నన్న ఆందోళనతో జనం భయపడాల్సి వస్తోంది. ఈ రోడ్డులో ఉన్న చినగంట్యాడ శ్మశానం, గాజువాక పీహెచ్‌సీ, గాజువాక తహశీల్దార్ కార్యాలయాలను ఆనుకొని వాహనాలు నిలిపివేస్తున్నారు. అనధికార పార్కింగ్‌ను అనుమతించేది లేదంటూ చెబుతున్న ట్రాఫిక్ సిబ్బంది.. వాటిపై చర్యలు తీసుకోవడం లేదు.

నివాస ప్రాంతాల్లోనూ అదే తీరు

గాజువాకలోని వివిధ నివాస ప్రాంతాల్లో అదే తీరు కొనసాగుతోంది. ఇళ్లను ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాల్లో భారీ వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. ఆటోనగర్‌కు ఆనుకొని ఉన్న విశ్వేశ్వరయ్య ప్రధాన రహదారిలో పెద్ద పెద్ద లారీలను, ట్యాంకర్లను, ట్రాలర్లను నిలిపివేస్తున్నారు. వాటిలో ప్రమాదకరమైన యాసిడ్ ట్యాంకర్లు కూడా ఉంటున్నట్టు స్థానికులు చెబుతున్నారు.



పాతగాజువాకలో ప్రైవేట్ బస్సుల పార్కింగ్

సూచనలు ఇవీ

- ఫార్మా బస్సులు ఎక్కడ ఆపాలో హాల్ట్‌ను నిర్ణయిస్తాం. అక్కడే ఆపాలి.
- శ్రీనగర్ దగ్గర ఆటోనగర్ లోపల నుంచి షీలానగర్ వైపు వెళ్లాలి. గాజువాక వైపు రావడానికి వీల్లేదు. పాతగాజువాక నుంచి శ్రీనగర్ జంక్షన్ వరకు హైవేపై ఫార్మా బస్సులు నడపొద్దు.
- హాల్ట్ ఇచ్చిన ప్రదేశాల్లో బస్సుల నిర్వాహకులే ట్రాఫిక్ వలంటీర్లను నియమించుకొని ట్రాఫిక్‌ను రెగ్యులరైజ్ చేసుకోవాలి.
- ఫార్మా సిబ్బంది తమ ద్విచక్ర వాహనాలను కూడా ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయరాదు. వంటిల్లు జంక్షన్, సీఎంఆర్ సెంట్రల్ సందు, పాతగాజువాక జంక్షన్ సర్వీస్ రోడ్ కూర్మన్నపాలెం, వడ్లపూడిలలో ప్రధాన రహదారులను ఆనుకొని పార్కింగ్ చేయరాదు.
- ఈ సమావేశం జరిగి నెల రోజులు దాటినా ఈ నిబంధనలపై ఇటు పోలీసులు, అటు బస్సుల నిర్వాహకులు ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం విశేషం.

త్వరలో కార్యాచరణ

ఫార్మా బస్సుల రాకపోకలు, రూట్ల విషయంలో ఇప్పటికే నిర్వాహకులతో సమావేశం నిర్వహించాం. ప్రస్తుతం వారికి కొద్ది సమయం ఇచ్చాం. దీనిపై మేము కూడా అధ్యయనం చేస్తున్నాం. త్వరలోనే తగిన విధంగా చర్యలు తీసుకుంటాం. భారీ వాహనాల పార్కింగ్ విషయంలో కూడా ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నాం. ఇప్పటికే చాలా వాహనాలకు అపరాధ రుసుం కూడా విధించాం. ఈ డ్రైవ్ కొనసాగుతుంది.

– కోటేశ్వరరావు, గాజువాక ట్రాఫిక్ సీఐ

క్లుప్తంగా

పారాయణ సమితి బృందానికి సత్కారం



బొర్రమాంబ పారాయణ సేవా సమితి బృందాన్ని సత్కరిస్తున్న తాతారావు, తదితరులు

అగనంపూడి: మహాత్మాగాంధీ సేవా సమితి ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు భారతీయ ప్రాచీన సాంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేలా బొర్రమాంబ పారాయణ సేవా సమితి కృషి చేస్తుందని డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు అన్నారు. అగనంపూడిలో మేడిశెట్టి విజయ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మహాత్మాగాంధీ సేవా సమితి అధ్యక్షుడు చిత్తా రామారావుతోపాటు పారాయణ సేవా సమితి ప్రతినిధులను సత్కరించారు. ఓపక్క సేవా కార్యక్రమాలు, మరో పక్క దైవ చింతనలో ఉండడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జననీ సేవా సంస్థ చైర్మన్ విందుల వెంకటరమణ, కరణం సత్యారావు పాల్గొన్నారు.

అగనంపూడి జోన్ ఏర్పాటు చేయాలని వినతి

అగనంపూడి: గాజువాక జోన్‌లోని 77, 78, 79, 85, 88 వార్డులతో కలిపి అగనంపూడి జోన్ ప్రకటించేలా జీవీఎంసీలో ఒత్తిడి తీసుకురావాలని స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎం.ముత్యాలనాయుడును అగనంపూడి నాయకులు కోరారు. వెదుళ్లనరవలో బుధవారం సమావేశమైన నాయకులు ముత్యాలనాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. పెందుర్తి–2 జోన్‌గా కాకుండా అగనంపూడి లేదా గాజువాక జోన్–2గా ప్రకటించేలా పాలకవర్గంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. నాయకులు బి.సత్యనారాయణ, టి.వెంకటరమణ, బి.చందు, వి.శ్రీనివాసరావు, పి.అచ్యుత్, వి.నాగేంద్ర పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ అక్షరాలు, భాష, మాట, పరస్పర సమన్వయంతో కవిత పుట్టుకొస్తుందన్నారు. మాట కవిత్వంగా ధ్వనించాలంటే రుషితత్వం కావాలన్నారు. అసలైన కవిత్వం ప్రజల సమస్యలను, కన్నీళ్లను సముదాయించి సమాజ సంక్షేమానికి బాట కావాలని పేర్కొన్నారు. కవులు వినయ భూషణ్, కె.రామ్‌ప్రసాద్, సిహెచ్.చిన సూర్యనారాయణ, బి.ఎస్.మూర్తి, కె.వి.ఎస్.మూర్తి, కె.జగదీశ్వరరావు, వి.హెచ్.రామ్మోహన్, జి.రామమూర్తి, ఆర్.శివాజీ తమ స్వీయ కవితలు చదివి వినిపించారు. చల్లా రాంబాబు కవితలను సమీక్షించారు.

ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ లక్ష్యాలను వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. డిస్ట్రిక్ట్ మిషన్ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం) ఆధ్వర్యంలో బుధవారం సూర్యాబాగ్‌లోని బిల్ జంక్షన్ సమావేశ మందిరంలో నిర్వహించిన వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్టేట్ టెక్నికల్ కన్సల్టెంట్ కోటి రెడ్డి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ లక్ష్యాలను వివరించారు. ప్రజలకు అందించాల్సిన సేవలపై అవగాహన కల్పించారు.

నిబద్ధతతో పని చేయాలి

తాటిచెట్లపాలెం: డీఆర్‌ఎం లలిత్ బోహ్రా బుధవారం మర్రిపాలెంలోని మల్టీ డిసిప్లినరీ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న లోకోపైలట్స్, అసిస్టెంట్ లోకో పైలట్స్, ట్రైన్ మేనేజర్లతో ఆయన ముఖాముఖి మాట్లాడి శిక్షణకు సంబంధించిన విషయాలను తెలుసుకున్నారు. శిక్షణ పొందుతున్న వారంతా ఏకాగ్రత, ఉన్నత ప్రమాణాలు, నిబద్ధతతో విధులు నిర్వర్తించేలా ముందుకు సాగాలని సూచించారు. జాతి నిర్మాణంలో రైల్వేల ద్వారా కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు.. అన్నసమారాధనలు



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



గణపతికి పూజలు చేస్తున్న నాయకులు

పెదగంట్యాడ: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నెల్లిముక్కు ధర్మాల వీధిలో పెంటమాంబ యువజన సేవా సంఘం ప్రతినిధులు పిట్ట రమణ, ధర్మాల ఎల్లయ్యరెడ్డి, ధర్మాల రామిరెడ్డి, గొందేశి సుమన్‌రెడ్డి, నీలాపు సత్తిరెడ్డి, ధర్మాల పైడిరెడ్డి, పిట్ట పైడిరెడ్డి, బాబురావు, కిషోర్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపతి మండపం వద్ద బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. సుమారు 3వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాసరెడ్డి, నాయకులు గొందేశి మహేశ్వర రెడ్డి, కొయ్య భారతి పాల్గొన్నారు.

- పెదగంట్యాడలో ఏర్పాటు చేసిన వినాయకుడిని గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాతా బాలాకృష్ణ, 75వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొందేశి శ్రీనివాసరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు.

సమస్యలు పరిష్కరించాలని గిగ్ వర్కర్ల ధర్నా

సీతంపేట: తమ సమస్యలు పరిష్కరించాలంటూ గిగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం అక్కయ్యపాలెం లేబర్ ఆఫీస్ వద్ద స్విగ్గీ, జొమాటో రైడర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కుమార మంగళం, అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ జిల్లాలో 40 వేల మంది యువత ఏడేళ్లుగా స్విగ్గీ, జొమాటో వంటి ప్లాట్‌ఫామ్స్‌లో పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అక్రమంగా తొలగించిన ఐడీలను పునరుద్ధరించాలని, 8 గంటలు ఆన్‌లైన్‌లో ఉంటే మినిమం గ్యారంటీ ఆదాయం చెల్లించాలని డిమాండ్ చేశారు. 365 రోజులు ఒకే రకమైన రేటు, ఇన్సెంటివ్, కిలో మీటర్‌కు ఎంత రేటు ఇస్తారో యాప్‌లో చూపించాలన్నారు. బేస్ పే రూ.30కు పెంచాలని, గతంలో ఇచ్చిన విధంగా పీక్ రూ.12, నాన్ పీక్ రూ.10 ఇవ్వాలని కోరారు. ఇన్సెంటివ్‌కు 2 పిక్స్ కంపల్సరీ చేయరాదన్నారు. లేబర్ కమిషనర్ జోక్యం చేసుకుని యాజమాన్యాలతో మాట్లాడి సమస్యలకు పరిష్కారం చూపాలని, లేని పక్షంలో ప్రతి శని, ఆదివారాల్లో సేవలకు బంద్ పాటిస్తామని హెచ్చరించారు. నాయకులు ఎం.శ్రీనివాస్, అచ్యుత్, నాని, అర్జున్, నగరంలో రైడర్లు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొని తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.



అక్కయ్యపాలెం లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న గిగ్ వర్కర్లు

దేశ నిర్మాణంలో ఎన్‌ఎస్‌ఎస్ కీలకం

మద్దిలపాలెం: దేశ నిర్మాణంలో జాతీయ సేవా పథకం వలంటీర్లు కీలక భూమిక పోషించాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఏయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీ రిపబ్లిక్ డే ఎంపిక కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సహజ నైపుణ్యాలతో రాణించాలన్నారు. సామర్థ్యాలను గుర్తించి, వాటిని మరింత మెరుగుపరచుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మెగా ఈవెంట్ నిర్వహించాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రాంతీయ కేంద్ర యువజన అధికారి సైదా రమావత్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ శిబిరం అత్యుత్తమమైనదన్నారు. పారదర్శకంగా వలంటీర్లను ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ ఎం.సుధాకర్ మాట్లాడుతూ జాతీయ సేవా పథక కార్యక్రమాల్లో ఏయూ అగ్ర భాగాన ఉందని ప్రశంసించారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డి.సింహాచలం, జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గాయకుడు రామకృష్ణకు స్వర నీరాజనం

సీతంపేట: సినీ నేపథ్య గాయకుడు వి.రామకృష్ణ జయంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అక్కయ్యపాలెం స్వరాలయ స్టూడియోలో రామకృష్ణకు స్వర నీరాజనం అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరిలో రామకృష్ణ పాడిన పాటలను గాయనీ గాయకులు ఆలపించి అలరించారు. ముందుగా ముఖ్య అతిథి న్యాయవాది ఉప్పలపాటి జానకి రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. చెన్నా తిరుమలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాయనీ గాయకులు ఎం.శ్రీనివాస్ కుమార్, జి.కె.రాధ, మహమ్మద్ ఖాన్, సుజాత, రుద్రవేణి, శ్యామ్, కృష్ణవేణి పాటలు పాడి అలరించారు.

మరణిస్తూ.. మరొకరికి చూపునిచ్చి...



నారాయణమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

అగనంపూడి: లయన్స్‌క్లబ్ చైర్‌పర్సన్ గుదే సుశీలా గజేంద్రరావు మాతృమూర్తి నారాయణమ్మ మరణిస్తూ మరొకరికి చూపునివ్వడం గర్వంగా ఉందని రాష్ట్ర చేనేత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పప్పు రాజారావు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మి రామునాయుడు అన్నారు. సుశీలా గజేంద్రరావు మాతృమూర్తి నారాయణమ్మ సంతాపసభ బుధవారం పెదమడకలోని గుదే నివాస్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి నేత్రాలు దానం చేసిన గజేంద్రరావును అభినందించారు. ఆయన చేస్తున్న కార్యక్రమాలకు ఆమె వెన్నంటి నడిపేవారన్నారు. కార్యక్రమంలో ఇల్లపు ప్రసాద్, పద్మశాలి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కొలిపాక అప్పారావు, బొండా అప్పారావు మాస్టార్, బలిరెడ్డి సత్యనారాయణ, కర్రి దోంద్ర, గవర సోమశేఖర్, కిడిమి హనుమంతు రావు, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అదుపు తప్పితే....



అధిక లోడ్‌తో ప్రమాదకరంగా వెళ్తున్న వాహనం

పెదగంట్యాడ: మండలంలోని కొంత మంది వాహనదారులు పరిమితికి మించిన లోడ్‌తో ప్రమాదకరంగా ప్రయాణం కొనసాగిస్తున్నారు. మండలంలో ఫైర్ స్టేషన్ నుంచి యాతపాలెం వెళ్లే ప్రధాన రహదారిలో నిత్యం వేలమంది ప్రయాణం చేస్తుంటారు. ఆ మార్గంలో అధిక లోడ్‌తో వాహనాలు వచ్చినప్పుడు ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోడ్ బండి ఏ మాత్రం అదుపు తప్పినా పెద్ద ప్రమాదమే సంభవిస్తుంది.

పెండింగ్ డీఏలు మంజూరు చేయాలి

యూటీఎఫ్ డిమాండ్

అగనంపూడి: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా వెంటనే పెండింగ్ డీఏ మంజూరు చేయడంతో పాటు పీఆర్‌సీ అమలు చేసే వరకు ఇంటీరియమ్ రిలీఫ్ విడుదల చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటీఎఫ్) గాజువాక మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సబ్బారపు నూకరాజు, ఇమంది ప్రసాద్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అగనంపూడి, శనివాడ, ఉప్పరకాలనీ, అగనంపూడి బీసీ కాలనీతో పాటు గాజువాక మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఈ ప్రభుత్వం ఏడాదిన్నరలో ఒక్క డీఏ కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వం నియమించిన పీఆర్‌సీ కమిషన్‌ను రద్దు చేసి నేటికీ ఐఆర్ ప్రకటించకపోవడం.. సీపీఎస్ రద్దు చేయకపోవడం ఉద్యోగులను నిర్లక్ష్యం చేయడమే అవుతుందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు ఎం.శ్రీనివాసరాజు, ఎస్.శ్రీనివాసరావు, కె.మురళీకృష్ణ, డి.నూకరాజు, జీఎల్ఎస్ మల్లేశ్వరి, ప్రేమలత, త్రివిక్రమ్, తస్నీమ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.



అగనంపూడి పాఠశాలలో మాట్లాడుతున్న నూకరాజు, ప్రసాద్

బాబోయ్ మురుగు

- రోడ్డుపైకి పోటెత్తుతున్న వాడుక నీరు
- ఆర్నెల్ల నుంచి ఇదే దుస్థితి
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



చెత్తా చెదారంతో నిండిన మురుగుకాలువ



రోడ్డుపై నుంచి పారుతున్న మురుగునీరు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు గుల్లవానిపాలెం షిర్డీసాయినగర్‌లోని ప్రధాన రహదారిపైకి మురుగు ప్రవహిస్తోంది. ఆర్నెల్ల నుంచి ఇదే దుస్థితి ఉన్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమలు, పందులతో సహవాసం చేస్తున్నామని వాపోతున్నారు. ఇళ్లలో మురుగునీరు రోడ్డుమీదుగా ప్రవహిస్తున్న విషయం జీవీఎంసీ డీఈ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛ విశాఖ, స్వచ్ఛ సర్వేక్షణ్ అని ఊదరగొట్టే అధికారులకు మా ఇబ్బందులు పట్టకపోవడం దారుణమని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. జీవీఎంసీ కమిషనర్ స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఏయూ న్యాయ కళాశాలలో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న ఏయూ విద్యార్థులు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో టీచర్స్ డే వేడుకల్లో భాగంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఏయూ ఉపకులపతిగా అందించిన సేవలను వివరించారు. అనంతరం రక్తదానం చేసిన వారిని అభినందించారు. రక్తదానం చేస్తే ముగ్గురికి ప్రాణదానం చేసే అవకాశం లభిస్తుందన్నారు. యువత ఆరోగ్యకరమైన అలవాట్లతో రక్తదాతలుగా నిలవాలని సూచించారు. న్యాయ కళాశాల ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుమ్మేసిన వాన



చెరువును తలపిస్తున్న రోడ్డు

బుధవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకూ పెదగంట్యాడ మండలంలో వర్షం కుమ్మేసింది. అప్పటి వరకూ ఎండ కాసింది.. ఒక్కసారిగా ఆకాశంలో మేఘాలు కమ్మి ఉరుములు మెరుపులతో ప్రారంభమై వర్షం దాదాపు గంటసేపు దంచికొట్టింది. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. -పెదగంట్యాడ

పూర్తిగా నీటమునిగిన 20-20 పార్కు →





సీతానగరం వంతెన వద్ద రోడ్డు పై వర్షపునీరు నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్న స్థానికులు